ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
మంచిర్యాల జిల్లా వార్తలు
5
మంగళవారం 6 ఫిబ్రవరి 2024



సజావుగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు

ఏసీసీ, ఫిబ్రవరి 5 : జిల్లా వ్యాప్తంగా ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ఐదవ రోజు సోమవారం సజావుగా జరిగాయి. ఉదయం జనరల్ విభాగంలో 188 మందికి 160 మంది హాజరయ్యారు. ఒకేషనల్ విభాగంలో 240 మందికి 230 మంది హాజరయ్యారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలో జనరల్ విభాగంలో 158 మందికి 145 మంది, ఒకేషనల్ విభాగంలో 246 మందికి 220 మంది హాజరయ్యారు. జిల్లా వ్యాప్తంగా 36 పరీక్ష కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పరీక్ష ప్రశాంతంగా జరిగినట్లు డీఐఈవో శైలజ తెలిపారు.

ప్రైవేటు డ్రైవర్లకు ప్రాధాన్యం ఇవ్వాలి



డీఎంకు వినతిపత్రం ఇస్తున్న ప్రైవేటు డ్రైవర్లు

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 5: ప్రభుత్వం త్వరలో టీఎస్ఆర్టీసీలో విడుదల చేసే ఉద్యోగాల్లో ప్రైవేటు ఆర్టీసీ డ్రైవర్లకు ఎలాంటి నిబంధనలు లేకుండా ఉద్యోగాలు ఇవ్వాలని ప్రైవేటు డ్రైవర్ల సంఘం అధ్యక్షుడు రేగుంట రమేష్, ప్రధాన కార్యదర్శి నజీర్‌లు పేర్కొన్నారు. సోమవారం ఆర్టీసీ డిపోలో డీఎంకు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ప్రభుత్వం టీఎస్ఆర్టీసీలో నోటిఫికేషన్ ఇవ్వడానికి సిద్ధమవుతుందన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పని చేస్తున్న డ్రైవర్లను ఉద్యోగాల్లోకి తీసుకున్న తర్వాతనే ఇతరులకు అవకాశం కల్పించాలన్నారు.

కుష్ఠు వ్యాధి నిర్మూలన అందరి బాధ్యత

చెన్నూరు, ఫిబ్రవరి 5: కుష్ఠు వ్యాధి నిర్మూలన అందరి బాధ్యత అని మున్సిపల్ చైర్‌పర్సన్ అర్చనరామ్‌లాల్‌గిల్డా పేర్కొన్నారు. ఫిబ్రవరి 15 వరకు నిర్వహించే కుష్ఠు వ్యాధి నివారణలో భాగంగా సోమవారం చెన్నూరు మున్సిపల్ కార్యాలయంలో వ్యాధి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చైర్‌పర్సన్ మాట్లాడుతూ కుష్ఠు వ్యాధి నివారణకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది కృషి చేయాలని సూచించారు. చర్మంపై మచ్చలు ఏర్పడితే ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైస్‌చైర్మన్ నవాజుద్దీన్, కమిషనర్ గంగాధర్, కౌన్సిలర్లు రేవెల్లి మహేష్, జగన్నాథుల శ్రీనివాస్, ఆయుబ్‌ఖాన్, డీసీఎంఓ శివకుమార్, డీపీఎంవో రాఘవయ్య, ఎంపీహెచ్‌ఈ జగదీష్, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

దండేపల్లి, ఫిబ్రవరి 5: రాష్ట్రస్థాయి సాంఘిక శాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాస్థాయిలో నిర్వహించిన సాంఘిక శాస్త్ర ప్రతిభాపాటవ పోటీలో వెల్గనూర్ ఉన్నత పాఠశాలకు చెందిన డి.అభినయ్ ప్రథమ స్థానం సాధించి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. యేటా నిర్వహించే పోటీల్లో ఇదే పాఠశాల నుంచి వరుసగా ఐదోసారి జిల్లాలో ప్రథమ స్థానం సాధించడం గమనార్హం. సోమవారం విద్యార్థి అభినయ్‌ను హెచ్‌ఎం విజయలక్ష్మి, గైడ్ టీచర్ ఆవుల నరసింహులు, ఉపాధ్యాయులు అభినందించి పురస్కారం అందజేశారు.

విపత్తులపై విద్యార్థులకు అవగాహన

మందమర్రిరూరల్, ఫిబ్రవరి 5: ఆదర్శ పాఠశాలలో సోమవారం విపత్తులు, రక్షణ చర్యలపై ఎన్‌డీఆర్‌ఎఫ్ టీం కమాండర్ బీటెన్‌సింగ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. వరదలు, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వాటి నుంచి ఎలా రక్షించుకోవాలనే అంశాలను విద్యార్థులకు ప్రదర్శనల రూపంలో వివరించారు. తహసీల్దార్ చంద్రశేఖర్, ఎంఈవో జాడి పోచయ్య, జిల్లా సెక్టోరల్ అధికారి సత్యనారాయణమూర్తి, ప్రిన్సిపాల్ జయకృష్ణరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి

మందమర్రిటౌన్, ఫిబ్రవరి 5 : రాజ్యాధికారంతోనే బీసీల అభివృద్ధి సాధ్యమని, దేశ వ్యాప్తంగా బీసీ కుల గణన చేపట్టాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఊదరి చంద్రమోహన్‌గౌడ్ తెలిపారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ బీసీ కుల గణన జాప్యం చేయడం వల్ల బీసీలు నష్టపోతున్నారన్నారు. బీసీల కుల గణన చేపట్టాలని సంఘం ఆధ్వర్యంలో పోరాటాలు చేస్తున్నామన్నారు. ఈ నెల 8న ఛలో ఢిల్లీ పార్లమెంట్ ముట్టడి కార్యక్రమానికి పిలుపునిచ్చామన్నారు. రాష్ట్రంలో అగ్రవర్ణాలు 7 శాతం ఉంటే 10 శాతం రిజర్వేషన్‌లు కల్పించడం దారుణమన్నారు. అన్ని వర్గాల బీసీలు పార్లమెంట్ ముట్టడిని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పార్లమెంట్ ముట్టడి కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు శ్రీనివాస్, సలామోద్దీన్, శంకర్, రవీందర్, శేఖర్, పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్స్ మేళా

హాజీపూర్, ఫిబ్రవరి 5 : వేంపల్లి ఎస్‌వీఎస్ ఫంక్షన్‌హాలులో సోమవారం ఫొటోగ్రాఫర్స్ మేళా నిర్వహించారు. కెమెరా సృష్టికర్త డ్యాగురే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఫొటోషాప్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్‌పై శిక్షణ ఇచ్చారు. పోటీల్లో గెలుపొందిన ఫొటోగ్రాఫర్లకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. అనంతరం ఫొటో పరివార్ కార్డులను అందజేశారు. పరివార్ కార్డుతో ఆల్బమ్ ప్రింటింగ్‌తోపాటు కెమెరాల కొనుగోలు చేసేటప్పుడు ప్రత్యేక తగ్గింపు ఉంటుందని తెలిపారు. ఫొటోవీడియోగ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌గౌడ్, మాజీ కోశాధికారి మధు, జిల్లా అధ్యక్షుడు కలర్స్ సతీష్, పాల్గొన్నారు.

నేడు కార్మెల్ పాఠశాల వార్షికోత్సవం



మాట్లాడుతున్న కార్మెల్ స్కూల్ కరస్పాండెంట్

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 5: కార్మెల్ పాఠశాల వార్షికోత్సవాన్ని విజయవంతం చేయాలని కరస్పాండెంట్ జేవీఆర్ రెక్స్ తెలిపారు. సోమవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 1963 ఫిబ్రవరి 6న కార్మెల్ పాఠశాలను ప్రారంభించామని తెలిపారు. పాఠశాల నెలకొల్పి నేటికి 60 వసంతాలు పూర్తి చేసుకుంటుందన్నారు. పాఠశాలలో ఫీజుల కంటే నాణ్యమైన విద్యాబోధనే లక్ష్యంగా పని చేస్తున్నా మన్నారు. పాఠశాల ఈ స్థాయికి చేరుకోవడానికి విద్యార్థుల తల్లిదండ్రుల సహకారం మరువలేనిదని తెలిపారు. ఇటీవల జూనియర్ కళాశాల ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. వేడుకలకు మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, జడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఓదెలు, పాఠశాల విద్యాబోధన చేసిన రిటైర్డు ఉపాధ్యాయులు, ఫాదర్లు, బిషప్‌లు హాజరవుతున్నారని పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

క్యాలెండర్ల విడుదల

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 5: తెలంగాణ నాలుగో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం 2024 క్యాలెండర్లను కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ బదావత్ సంతోష్ విడుదల చేశారు. సంఘం జిల్లా అధ్యక్షులు సుమిత్, ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, ఉపాధ్యక్షురాలు కవితరాణి, సంయుక్త కార్యదర్శి చంద్రయ్యలు పాల్గొన్నారు.

మొదలైన సమ్మక్క జాతర సందడి..





నస్పూర్‌లో మొక్కు తీర్చుకోవడానికి తులాభారంలో భక్తుడు

- బెల్లం కొనుగోళ్లు ముమ్మరం..
- దుకాణాల వద్ద భక్తుల రద్దీ
- జిల్లా నుంచి 365 బస్సులు...
- మహిళలకు ఉచిత ప్రయాణం...
- సమ్మక్క-సారక్క జాతరకు సిద్ధం

నస్పూర్, ఫిబ్రవరి 5: సమ్మక్క-సారలమ్మ వన దేవతల జాతరకు అన్ని సిద్ధమవుతున్నాయి. జాతర సమయం సమీపిస్తున్న కొద్ది అధికారులు భక్తులకు కావాల్సిన ఏర్పాట్లను ముమ్మరం చేస్తోంది. రెండేళ్ళకోసారి నిర్వహించే జాతర వేడుకలు మాఘ పౌర్ణమికి ముందు నాలుగు రోజుల పాటు సమ్మక్క- సారక్క జాతరను భక్తులు కోలాహలంగా జరుపుకుం టారు. పేరుకు గిరిజన జాతర అయినప్పటికి అన్ని వర్గాలకు చెందిన భక్తులు భక్తి శ్రద్ధలతో వన దేవతలకు పూజలు చేస్తారు.

ఈ నెల 21 నుంచి మేడారంలో జాతర ప్రారంభం సందర్భంగా మహా జాతరలో పాల్గొని తల్లులను దర్శించి మొక్కులు చెల్లించడానికి భక్తజ నం తరలి వెళ్లడానికి సిద్ధమవుతున్నారు. ఇందులో భాగంగా భక్తుల రద్దీకి అను గుణంగా ఆర్టీసీ మంచిర్యాల జిల్లా నుంచి 365 బస్సులను నడిపిస్తోంది. మేడారం జాతరకు వెళ్ళే భక్తులతోపాటు పలువురు ఇంటి వద్ద సమ్మక్క సారక్కకు మొక్కులు చెల్లించుకుంటారు. మేక, కోళ్ళతో బంధువులను ఆహ్వానించి మొక్కులు చెల్లించుకుంటున్నారు. జిల్లాలో ముందస్తుగానే సమ్మక్క-సారక్కలకు మొక్కులు చెల్లించడానికి బెల్లం (బంగారం) కొనుగోలు చేస్తున్నారు. బెల్లం దుకాణాల వద్ద భక్తుల సందడి వాతావరణం నెలకొంది. సింగరేణి యాజమాన్యం బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడకుండా ఏరియాల వారీగా సమ్మక్క-సారక్క జాతరను నిర్వహిస్తున్నా కార్మిక కుటుంబాలు మాత్రం మేడారం వైపే మొగ్గు చూపుతారు.

బంగారం తులాభారం

జిల్లాలో పది కిలోలు, కిలో బెల్లం ముద్దలు, చక్కర అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. జిల్లా వ్యాప్తంగా దాదాపు 250 టన్నుల బెల్లం అమ్మకాలు జరుగుతున్నట్లు వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. సమ్మక్క, సారలమ్మ వన దేవతలకు మొక్కులను సమర్పించడానికి బంగారం (బెల్లం) ముఖ్యమైనది. తులాభారం ద్వారా మొక్కులను సమర్పించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. దీంతో బెల్లం అమ్మకాల దుకాణాలు, కిరాణ దుకాణాల వద్ద బెల్లం కొనుగోలుకు భక్తులు మంగళహారతులతో వెళ్తున్నారు.

భక్తులు ఉన్న బరువుతో సమానంగా బంగారం తూకం (తులా భారం) వేసి అమ్మవారి గద్దెల వద్ద సమ ర్పించడం ఆనాదిగా వస్తోంది. మార్కెట్‌లో పది కిలోల బెల్లం ధర కిలో రూ. 36 నుంచి 38 వరకు, కిలో బెల్లం ముద్ద రూ.45, చక్కర కిలో రూ. 40లకు లభిస్తున్నాయి. బెల్లం పంచని వారు కొందరు చక్కరను కూడా పంచిపెడుతున్నారు. మహా జాతర సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సీజన్‌లో బెల్లం, చక్కర, మేకలు, కోళ్ళు, మద్యం, వాహనాల అద్దెలు, కొబ్బరి కాయలు తదితర వ్యాపారం దాదాపు 20 కోట్ల వరకు పైగా ఉంటుందని అంచనా.

మేడారంకు ముందుగా శివయ్య మొక్కులు..

సమ్మక్క, సారలమ్మ మేడారం మహాజాతరకు ముందుగా వేములవాడ, కొండగట్టు ఆలయాలను దర్శించి మొక్కులను సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. జిల్లా నుంచి భక్తులు పెద్ద ఎత్తున వేములవాడ, కొండగట్టు పుణ్యక్షేత్రాలకు వెళుతుంటారు. వేములవాడ రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి, బద్దిపోచమ్మ అమ్మవారికి బోనాలు చెల్లిస్తారు. మేడారం జాతరకు ముందుగానే శివయ్య దర్శించి కోడెమొక్కును, తలనీలాను సమర్పిస్తారు. భక్తులు వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవాలయం దర్శించి మొక్కులను చెల్లించిన తరువాతనే మేడారం వెళ్ళి వనదేవతలను దర్శనం చేస్తారు.

మేడారం బస్సు చార్జీలు ఇలా...

మంచిర్యాల పాయింట్ నుంచి 110 బస్సులు, చెన్నూరు-65, శ్రీరాంపూర్ -45, మందమర్రి-65, బెల్లంపల్లి-10, ఆసిఫాబాద్-70 బస్సులు ఆయా పాయింట్ వద్ద నుంచి భక్తులను మేడారం చేర్చనున్నాయి. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, భైంసా, నిర్మల్, ఉట్నూరు, మంచిర్యాల డిపోలకు చెందిన బస్సులను నడిపిస్తున్నాయి.

- చెన్నూరు నుంచి మేడారం 202 కిలో మీటర్ల పెద్దలకు రూ. 420, పిల్లలకు రూ. 230,
- శ్రీరాంపూర్ నుంచి 190 కిలోమీటర్లు పెద్దలకు రూ. 400, పిల్లలకు రూ. 210,
- మందమర్రి నుంచి 215 కిలోమీటర్లు పెద్దలకు రూ. 450, పిల్లలకు రూ. 250
- మంచిర్యాల నుంచి 200 కిలోమీటర్లు పెద్దలకు రూ. 410, పిల్లలకు రూ. 220
- బెల్లంపల్లి నుంచి 225 కిలోమీటర్లు పెద్దలకు రూ.460, పిల్లలకు రూ. 250,
- ఆసిఫాబాద్ నుంచి 265 కిలోమీటర్లు పెద్దలకు రూ. 550, పిల్లలకు రూ. 300 చార్జీలను వసూలు చేయనున్నారు.

మేడారం వైపే బస్సులన్నీ...

భక్తులను మేడారం తరలించడానికి 365 బస్సులను నడిపించడానికి సన్నద్ధమైంది. జిల్లాలో ఆరు పాయింట్లను ఏర్పాటు చేసింది. ఈసారి జాతరకు గతంలో కంటే బస్సు చార్జీలు రూ. 50 నుంచి 80 వరకు పెరిగాయి. జిల్లాలో ఐదు పాయింట్లు, ఆసిఫాబాద్ జిల్లా ఒక్క పాయింట్ ద్వారా మేడారం బస్సులను నడిపించడానికి ఆర్టీసీ అధికారులు ప్రణాళికను సిద్ధం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం మహాలక్ష్మి పథకం కింద మహిళలకు బస్సులో ఉచిత ప్రయాణం అమలు చేస్తోంది. జాతరకు వచ్చే మహిళలకు ఉచిత ప్రయాణం వర్తిస్తుందని మంత్రి సీతక్క ఇప్పటికే ప్రక టించారు. జిల్లాలోని చెన్నూరు, శ్రీరాంపూర్, మందమర్రి, మంచిర్యాల, బెల్లంపల్లితో పాటు కొమురంభీం ఆసిఫాబాద్ ఆర్టీసీ ప్రత్యేక పాయింట్ల నుంచి భక్తులను మేడారం తరలించాలని నిర్ణయించారు. ఆర్టీసీ ద్వారా వెళ్ళే భక్తులను గద్దెల సమీపం వద్దకు, దర్శనం మొక్కుల అనంతరం తిరుగు ప్రయాణంలో గమ్య స్థానాలకు ఆర్టీసీ చేర్చుతుంది. మేడారం జాతరకు 365 బస్సులను ఏర్పాటు చేసి దాదాపు లక్షకు పైగా ప్రయాణికుల రాకపోకలు సాగించే విధంగా ఆర్టీసీ లక్ష్యంగా నిర్ణయించింది.



ఆర్డీనరీ, ఎక్స్‌ప్రెస్, పల్లెవెలుగు బస్సులను మేడారంకు జాతరకు భక్తులను తరలించనున్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశం లేదు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి

ఏసీసీ, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఉద్దేశ్యం బీఆర్ఎస్‌కు లేదని మాజీ వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పద్మనాయక ఫంక్షన్‌హాలులో ఏర్పాటు చేసిన అసెంబ్లీ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్, మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్, మాజీ ఎమ్మెల్యేలు నడిపెల్లి దివాకర్‌రావు, దుర్గం చిన్నయ్యలతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాజీ సీఎం కేసీఆర్ గతంలో ఎవరు అమలు చేయని పథకాలు ప్రవేశపెట్టి పేదల అభ్యున్నతికి కృషి చేశారన్నారు. రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. ఆడ లేక గజ్జెలు పాతవి అన్నట్లుగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరు ఉందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో కలిసికట్టుగా పనిచేసి రాష్ట్రంలో అత్యధిక స్థానాల్లో బీఆర్ఎస్ గెలిచేందుకు కృషి చేయాలన్నారు. మాజీ ప్రభుత్వ విప్ బాల్క సుమన్ మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో భయపడాల్సిన అవసరం లేదని, ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజల కోసం పోరాడేందుకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలన్నారు. రైతుబంధు కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం విడుదల చేసిన రూ.7700 కోట్లను దారి మళ్లించి మంత్రి పొంగులేటికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్, కాంగ్రెస్ కాంట్రాక్టర్ల జేబుల్లో నింపుకున్నారన్నారు. డిసెంబరు 9న రుణమాఫీ చేస్తామని, రూ.4 వేల ఆసరా పింఛన్ అందిస్తామని, రూ.500లకే గ్యాస్ సిలిండర్, మెగా డీఎస్సీ, జాబ్ క్యాలెండర్ వంటి ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కేంద్ర, పక్క రాష్ట్రాల వారు తెలంగాణ ప్రాజెక్టుల వైపు చూడాలంటేనే భయపడ్డారని, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డ రెండు నెలల్లోనే కృష్ణ నదిపై ఉన్న ప్రాజెక్టులు కేంద్రం చేతుల్లోకి పోయాయన్నారు. సాగునీరు లేక రాష్ట్రంలో క్రాప్ హాలిడే ప్రకటించే దుస్థితి నెలకొందన్నారు. ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండె విఠల్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయఢంకా మోగిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రజలు కాంగ్రెస్‌కు ఎందుకు ఓట్లు వేశామని చింతిస్తున్నామన్నారు. మాజీ ఎమ్మెల్యే దివాకర్‌రావు మాట్లాడుతూ పెద్దపల్లి పార్లమెంటరీ నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు విస్తృత క్యాడర్ ఉందని, బీఆర్ఎస్ గెలుపు ఖాయమని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మాట్లాడుతూ కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీకి ప్రజల్లో ఆదరణ తగ్గలేదన్నారు. నల్మాసు కాంతయ్య, విజిత్‌రావు, పెంట రాజయ్య, తిప్పని లింగయ్య, శ్రీనివాస్‌రెడ్డి, అత్తి సరోజ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ అక్రమాలపై విచారణ ఏది?

మంచిర్యాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండలం ముత్యంపేట గ్రామ పంచాయతీలో వెలుగు చూసిన అక్రమాలపై విచారణ జరపడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారని గ్రామానికి చెందిన కొండ నరేష్ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. 1/70 చట్టం అమలులో ఉన్నా సర్వే నెంబర్ 82 భూముల్లో రియల్ ఎస్టేట్ వెంచర్లు ఏర్పాటయ్యాయి. వెంచర్లకు పంచాయతీ తరుపున స్టేట్ ఫైనాన్స్ కమిషన్ (ఎస్‌ఎఫ్‌సీ) నిధులతో రోడ్లు నిర్మించారు. రోడ్ల నిర్మాణానికి అధికారులు కుదిరే రాజేంద్రప్రసాద్ అనే కాంట్రాక్టరు పేరిట 12-10-2020న రూ. 1లక్షా 33వేల 215, రూ. 1లక్షా 47వేల 317కు సరిపడ నాలుగు వేర్వేరు చెక్కులు జారీ చేశారు. ఒకే పనిని బిట్లు బిట్లుగా చేసి నాలుగు పనులు చేసినట్లు చూపించి అక్రమాలకు పాల్పడ్డారు. ఈ విషయంలో ఎంబీ చేసిన అధికారులు సర్పంచుతో కుమ్మక్కయినట్లు ప్రచారం జరుగుతోంది. అక్రమాలపై అప్పటి కలెక్టర్ భారతీహోళికేరి నిధులను రికవరీ చేయాలని షోకాజ్ నోటీసులు జారీ చేశారు. నేటికి ఆదేశాలు అమలు కాకపోవడం గమనార్హం. పంచాయతీలో జరిగిన అక్రమాలపై 2021మార్చి 6న ఆంధ్రజ్యోతిలో 'పంచాయతీ సాక్షిగా అక్రమాలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. చర్యలు తీసుకుంటామని చెప్పేవారేగానీ మూడేళ్లు గడుస్తున్నా విచారణ జరపడం లేదని నరేష్ పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.

పంచాయతీల అభివృద్ధిలో ప్రత్యేకాధికారులు కీలక పాత్ర పోషించాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 5: సర్పంచుల పదవీకాలం ముగిసినందున ఈ నెల 2 నుంచి బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారులు గ్రామపంచాయతీల అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ రాహుల్, డీపీవో వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈవో నరేందర్, మిషన్ భగీరథ ఈఈ మధుసూదన్‌తో కలిసి ప్రత్యేకాధికారులు, ఎంపీడీవోలు, ఎంపీవో, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేకాధికారులు జవాబుదారి తనంతో వ్యవహరించాలని, నూతన పంచాయతీరాజ్ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పంచాయతీల ఎన్నికలు జరిగే వరకు అధికారులు, కార్యదర్శుల సమన్వయంతో పంచాయతీల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఈ నెల 7 నుంచి 14వ తేదీ వరకు ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నెల 15న జరగనున్న సమీక్ష సమావేశంలో ఉత్తమసేవలు అందించిన ప్రత్యేకాధికారులు, కార్యదర్శుల సేవలను గుర్తించి ప్రశంసాపత్రాలు అందిస్తామన్నారు.

ఈవీఎంల తనిఖీ

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి దశ తనిఖీ చేపట్టామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. నస్పూర్‌లోని ఈవీఎం గోదామును, ముల్కల్లలోని ఐజా ఇంజనీరింగ్ కాలేజీలోని స్ట్రాంగ్ రూంలను అదనపు కలెక్టర్ రాహులు, మోతిలాల్, చెన్నూరు ప్రత్యేక సబ్ కలెక్టర్ సిడాం దత్తులతో కలిసి పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ లోకసభ సాధారణ ఎన్నికల దృష్ట్యా తనిఖీ చేపట్టామని, గుర్తింపు పొందిన రాజ కీయ పార్టీల ప్రతినిధులు తనిఖీ సమయంలో హాజరు కావాలని తెలిపారు. ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, అధికారులు, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

బాల్క సుమన్ వ్యాఖ్యలపై వెల్లువెత్తిన నిరసనలు



దండేపల్లిలో బాల్క సుమన్ శవయాత్ర చేస్తున్న కాంగ్రెస్ పార్టీ శ్రేణులు

దండేపల్లి, ఫిబ్రవరి 5: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను మండల కేంద్రంలో కాంగ్రెస్ శ్రేణులు దహనం చేశారు. మంచిర్యాలలో బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ సమావేశంలో బాల్క సుమన్ ఒక రౌడీల మాట్లాడినందుకు నిరసనగా దండేపల్లిలో సుమన్ దిష్టిబొమ్మతో శవయాత్ర నిర్వహించి రాస్తారోకో నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహం నుంచి బస్టాండ్ వరకు డప్పుచప్పుళ్ళతో దిష్టిబొమ్మతో శవయాత్ర చేపట్టి ప్రధాన రహదారిపై దహనం చేశారు. సుమారు రెండు గంటల పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు రాస్తారోకో చేపట్టారు. దీంతో రోడ్డుకు ఇరువైపుల వాహనాలు నిలిచి పోవడంతో పోలీసులు రాస్తారోకోను విరమింపజేశారు. నాయకులు మాట్లాడుతూ సుమన్ బేషరత్తుగా క్షమాపణ చెప్పాలని లేదంటే నిరసనలను త్రీవం చేస్తామని హెచ్చరించారు. గడ్డం త్రిమూర్తి, అక్కల వెంకటేశ్వర్లు, కంది సతీష్, ముత్యాల శ్రీనివాస్, కమలాకర్, పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ జాగ్రత్తగా మాట్లాడడం నేర్చుకోవాలని మండల కాంగ్రెస్ నాయకుడు,మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు ఒడ్నాల కొమురయ్య ఒక ప్రకటనలో హెచ్చరించారు.

మందమర్రిటౌన్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని చెప్పుతో కొడతానంటూ చెప్పు చూపించిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చర్యలను ఖండిస్తూ మార్కెట్ సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు నిరసన చేపట్టారు. బాల్క సుమన్ క్షమాపణలు చెప్పాలని, లేకుంటే జిల్లాలో తిరగనివ్వమన్నారు.

సుమన్ చిత్రపటానికి చెప్పుల దండ వేసి నిరసన

చెన్నూరు: మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నిరసనగా పట్టణంలో సుమన్ చిత్రపటానికి చెప్పుల దండ వేసిన నిరసన తెలిపారు. ఇలాంటి పిచ్చి మాటలు మాట్లాడడం ఆపేయకుంటే తగిన బుద్దిచెబుతామని హెచ్చరించారు. చెన్నూరి శ్రీధర్, చెన్న సూర్యనారాయణ, నాగరాజు, అంకాగౌడ్, మహేష్, రాజేష్, మహేష్, ప్రసాద్,రాము, బషీర్, సుల్తాన్,ముజాహిద్, పాల్గొన్నారు.

బాల్క సుమన్‌కు శాస్తి తప్పదు : పీఎస్సార్

మంచిర్యాల, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై బాల్క సుమన్ వ్యాఖ్యలను ఖండిస్తున్నట్లు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు అన్నారు. హైదరాబాద్‌లో ఉన్న ఆయన సోమవారం వీడియో రిలీజ్ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్‌కు తగిన శాస్తి జరుగుతుందన్నారు. జిల్లాలో నువ్వు ఎక్కడ తిరిగినా కాంగ్రెస్ కార్యకర్తలు, ప్రజలు వెతికి మరీ శిక్షిస్తారన్నారు. తగిన మూల్యం చెల్లించక తప్పదంటూ హెచ్చరించారు.



చెన్నూరులో బాల్క సుమన్ చిత్రపటానికి చెప్పుల దండ వేసి నిరసన

బాల్క సుమన్‌పై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

ఏసీసీ: సీఎం రేవంత్‌రెడ్డిపై చెప్పుతో చూపుతూ అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీప్రభుత్వ విప్, బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్‌పై మంచిర్యాల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు సీఐ రవీందర్‌కు ఫిర్యాదు చేశారు. కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ బాల్క సుమన్ వ్యాఖ్యలపై ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖల ఆదేశాల మేరకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. పూదరి తిరుపతి, పెంట రజిత, గజ్జల హేమలత, నదీం, సురేందర్, వెంకటసాయి, జగన్, భీమయ్య, శ్యాం పాల్గొన్నారు. పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.



భక్తి శ్రద్ధలతో ఉర్సు ఉత్సవాలు

చెన్నూరు, ఫిబ్రవరి 5: పట్టణంలోని జమామసీదులో సయ్యద్ షా బాబా ఉర్సు ఉత్సవాలను సోమవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం గంధంలో భాగంగా జామా మసీదు నుంచి ప్రారంభమైన శోభాయాత్ర ఐబీ చౌరస్తాలోని దర్గా వరకు కొనసాగింది. రెండు రోజుల పాటు కొనసాగే ఉర్సు ఉత్సవాలకు అధిక సంఖ్యలో ప్రజలు తరలి వస్తారు. కుల మతాలకు అతీతంగా నిర్వహించే ఉర్సు ఉత్సవాలను విజయవంతం చేయాలని ఉర్సు ఉత్సవ కమిటీ సభ్యుడు నవాజ్ కోరారు. రెండు రోజుల పాటు జరిగే ఉత్సవాలకు ముంబైకి చెందిన కళాకారులతో కవ్వాలి ఎనిర్వహిస్తామని ఆయన పేర్కొన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రవీందర్ పట్టణంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఏసీసీ, ఫిబ్రవరి 5 : మంచిర్యాల పట్టణంలో రైలు కింద పడి సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు జీఆర్‌పీ ఎస్ఐ సుధాకర్ తెలిపారు. మృతుడి వయస్సు 35 సంవత్సరాలు ఉంటాయని, నలుపు రంగు చొక్క, లేత పచ్చరంగు జీన్స్ ప్యాంటు ధరించి ఉన్నాడని తెలిపారు. ఎస్ఐ ఆదేశాల మేరకు హెడ్ కానిస్టేబుల్ సంపత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతుని సంబంధీకులు 8712658596లో సంప్రదించాలని సూచించారు.

అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టివేత

జైపూర్, ఫిబ్రవరి 5 :మండలంలోని రసూల్‌పల్లి వాగు నుంచి సోమవారం తెల్లవారుజామున ట్రాక్టర్ల ద్వారా ఇసుక రవాణా చేస్తున్నారనే స్థానికుల సమాచారం మేరకు తనిఖీ చేయగా ఒక ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నామని మైనింగ్ ఏడీ ఆర్.బాలు పేర్కొన్నారు. ట్రాక్టర్‌ను జైపూర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థినుల మృతిపై విచారణ చేపట్టాలి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 5 : భువనగిరిలో పదో తరగతి విద్యార్థుల మృతిపై అనుమానాలున్నాయని, విద్యార్థినుల మృతికి కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దీపక్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యార్థుల వసతి గృహాల్లోకి ఆటో డ్రైవర్లు ఎలా ప్రవేశిస్తారని, ఆటో డ్రైవర్లను వార్డెన్ వసతి గృహంలోకి ఎలా అనుమతించారో విచారణ చేపట్టాలన్నారు. ఈ విషయంపై ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదో అర్థం కావడం లేదన్నారు. ఇద్దరు విద్యార్థినులు మృతి చెందినా ముఖ్యమంత్రి స్పందించకపోవడం దారుణమన్నారు. మృతికి కారణమైన వారిపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

యోగాలో చాంపియన్‌షిప్ సాధించిన రమేష్

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 5: బెల్లంపల్లి ఆర్య వైశ్య భవన్‌లో ఆదివారం జరిగిన జాతీయ స్థాయి యోగా పోటీల్లో మందమర్రికి చెందిన కొంపల్లి రమేష్ చాంపియన్ ట్రోఫీని సాధించి విజేతగా నిలిచారు. 50-60 సంవత్సరాల విభాగంలో ఆయన పథకం సాధించారు. రమేష్‌ను సోమవారం యోగా శిక్షకులు ముల్కల్ల శంకర్‌తోపాటు సభ్యులు అభినందించారు.

వన్యప్రాణులను వేటాడితే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న ఎఫ్ఆర్వో అప్పలకొండ

వాంకిడి, ఫిబ్రవరి 5: వన్యప్రాణులను వేటాడితే కఠినచర్యలు తీసుకుంటామని ఎఫ్ఆర్వోఅప్పలకొండ అన్నారు. సోమవారం చౌపన్‌గూడ గ్రామపంచాయతీలోని గోవిందాపూర్ గ్రామంలో వన్యప్రాణుల సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చేనులలో వన్య ప్రాణులను వేటాడేందుకు ఉచ్చులు అమర్చితే కఠనచర్యలు తీసుకుంటామన్నారు. వన్యప్రాణుల సంరక్షణ అందరి బాధ్యత అన్నారు. అడవుల్లో మంటలు చెలరేగితే తక్షణమే అటవీ శాఖాధికారులకు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎస్‌వో భగవంతరావు, ఎఫ్‌బీవో శ్రీవిద్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర చికిత్స కోసం తరలింపు

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 5: మండలంలోని చిర్రకుంట మాజీసర్పంచ్ అరిగెల లక్ష్మయ్య జ్ఞాపకార్థం వారి కమారులు జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, వేణు ఆధ్వర్యంలో 200మందిని నేత్ర వైద్యచికత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించనున్నారు. ప్రతి సంవత్సరం వారి తండ్రి జ్ఞాపకార్థం శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఆత్రంసక్కు, జడ్పీటీసీ నాగేశ్వర్‌రావు, ఎంపీపీ మల్లికార్జున్, సహకార చైర్మన్ అలీబీన్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలి

రెబ్బెన, ఫిబ్రవరి 5: రాష్ట్రంలో నేషనల్ హెల్త్‌మిషన్‌లో పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలను రెగ్యులర్ చేయాలని ఏఐటీయూసీ జిల్లాప్రధానకార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానికంగా ఆయన మాట్లాడారు. ఏఎన్ఎంల పోస్టుల భర్తీని వెంటనే రద్దు చేయాలన్నారు. పీఆర్సీ బకాయిలు కూడా వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న రెండో ఏఎన్ఎంలను డిపార్టుమెంటల్ పరీక్షల ద్వారా పర్మినెంటు చేయాలన్నారు. వీరికి అన్యాయం జరిగితే ఊరుకునేది లేదన్నారు. అనంతరం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని మెడికల్ అధికారి జాన్సన్‌కు అందజేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీఅధ్యక్షుడు స్వామి, ఏఎన్ఎంలు సునిత, వనిత, మండల్, తదితరులు పాల్గొన్నారు.













సర్పంచులకు సన్మానం

కాసిపేట, ఫిబ్రవరి 5 : పదవీ కాలం ముగిసిన సర్పంచులకు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులు సన్మానించారు. ఎంపీపీ రొడ్డ లక్ష్మీ మాట్లాడుతూ చేసిన పనులే గుర్తింపును తీసుకువస్తాయని తెలిపారు. 21 మంది సర్పంచులను సన్మానించారు. జడ్పీటీసీ పల్లె చంద్రయ్య, వైస్ ఎంపీపీ విక్రమ్ రావు, ఎంపీవో నాగరాజు, అధికారులు పాల్గొన్నారు.

ఉపసర్పంచులను సన్మానించకుండా అవమానపరిచారని ఉపసర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు బోయిని తిరుపతి ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. మహిళ సర్పంచులతో పాటు వారి భర్తలను సన్మానించిన అధికారులు ఉపసర్పంచులను సన్మానించకపోవడం దారుణమన్నారు.

ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు


ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, ఫిబ్రవరి 5: ప్రజావాణిలో అందిన ప్రతీ దరఖాస్తును పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకొంటామని కలెక్టర్ బదావత్ సంతోష్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ఆర్డీవోలు రాములు, హరికృష్ణలతో కలిసి ఆర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజావాణి నిర్వహిస్తున్నామని, ఒకే వేదికగా ఆర్జీలను స్వీకరించి త్వరగా పరిష్కా రానికి కృషి చేస్తామన్నారు. పలు మండలాల నుంచి ప్రజలు వచ్చి దరఖాస్తులు అందజేశారు.

కోటపల్లి: తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాల వసతి గృహానికి హైమాస్ట్ లైట్లు మంజూరు చేయాలని కలెక్టర్‌కు వినతిపత్రం అందించినట్లు ఎంపీపీ మంత్రి సురేఖరామయ్య తెలిపారు. వసతి గృహంలో ఇంటర్ చదివే బాలికలు ఉండడం, అటవీ ప్రాంతానికి సమీపంలో ఉండడంతో విద్యార్థులు ఇబ్బందుల పాలవుతున్నారని, ఇటీవల చిరుత పులి హాస్టల్ సమీపంలో సంచరించడంతో భయాందోళనలకు గురవుతున్నారన్నారు. కలెక్టర్ సముఖత వ్యక్తం చేసినట్లు ఎంపీపీ వివరించారు.

మండల కేంద్రంలోని రైసుమిల్లు నుంచి వచ్చే దుమ్ముధూళి వల్ల అనారోగ్యం పాలవుతున్నామని అధికారులు స్పందించాలని గొల్లవాడ కాలనీ వాసులు ఎంపీడీవో భాస్కర్‌కు ఫిర్యాదు చేశారు. బూడిద సంతోష్, సంపత్, సాయి, రాజన్న, 20 కుటుంబాల ప్రజలు పాల్గొన్నారు.

జైపూర్: జిల్లా కేంద్రంలోని ప్రజావాణిలో మండల సర్వేయర్‌పై నర్సింగాపూర్ గ్రామానికి చెందిన బోయిని రాజేందర్ ఫిర్యాదు చేశారు. రాజేందర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలోని 2-122 ఇంటి నెంబరులో తన కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటున్నానని తెలిపారు. ఈ ఇల్లు నేషనల్ హైవే ఆఫ్ అథారిటీ 363 విస్తరణలో భాగంగా ముంపునకు గురవుతుందన్నారు. నష్టపరిహారం జాబితాలో ఇంటిని చేర్చడానికి సర్వేయర్ డబ్బులు డిమాండ్ చేయడంతో రూ. 50 వేలు ఇచ్చినట్లు తెలిపారు. డబ్బులు తీసుకుని ఇంటి నెంబరును జాబితాలో నమోదు చేయకపోగా మరికొన్ని డబ్బులు కావాలని వేధింపులకు గురి చేస్తున్నాడన్నారు. తన డబ్బులు తనకు ఇప్పించాలని, రోడ్డు విస్తరణ ముంపు జాబితాలో ఇంటిని చేర్చాలని ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

మారుమూల గ్రామాల అభివృద్ధే లక్ష్యం


చామనపల్లిలో వంతెన నిర్మాణ పనులకు భూమి పూజ, బెల్లంపల్లిలో విద్యార్థులకు మెటీరియల్‌ను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

వేమనపల్లి, ఫిబ్రవరి 5: నియోజకవర్గంలోని మారుమూల గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సోమవారం చామనపల్లి వాగుపై మంజూరైన వంతెన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుమూల గ్రామాల సమస్యలను పరిష్కరించేందుకు పనిచేస్తున్నానని తెలిపారు. వాగుపై వంతెన లేకపోవడం, గ్రామానికి రోడ్డు లేకపోవడంతో ఇక్కడి ప్రజలు వర్షాకాలంలో బాహ్య ప్రపంచానికి దూరమవుతున్నారని గుర్తు చేశారు. త్వరలోనే బెల్లంపల్లిలోనే నివాసం ఉండి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే రెండు గ్యారంటీలను అమలు చేసిందని, త్వరలోనే మరో రెండు గ్యారంటీలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. జడ్పీటీసీ ఆర్.స్వర్ణలత, ఎంపీటీసీ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సాబీర్ అలీ, సర్పంచు గాలి మధు, ఎంపీడీవో లక్ష్మయ్య, ఎంపీవో బాపురావు, నాయకులు రమేష్‌గౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

సర్పంచ్‌ల సేవలు ప్రశంసనీయం

నెన్నెల: ఐదేళ్ల కాలంలో సర్పంచులు చేసిన సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. పదవీ విరమణ పొందిన నెన్నెల, కుశ్నపల్లి సర్పంచులు తోట సుజాతశ్రీనివాస్, సంధ్యామహేష్‌లకు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సర్పంచులు, ఉప సర్పంచులు, పాలక వర్గాల సభ్యులను సన్మానించారు. మండల కేంద్రంలోని సీసీ రోడ్ల నిర్మాణానికి నెల రోజుల్లో నిధులు మంజూరు చేస్తామన్నారు. పోడు భూముల సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అధికారులు, ప్రజాప్రతి నిధులు, ఎమ్మెల్యేను సన్మానించారు. ఎల్లమ్మ గుడి వద్ద నిర్మించే రోడ్డుకు శంకు స్థాపన చేశారు. గొళ్లపల్లిలో మండల స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఎంపీటీసీ బొమ్మెన హరీష్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గట్టు మల్లేష్, శంకరయ్య, మోహిద్‌ఖాన్, గట్టు బానేష్, తిరుపతిరెడ్డి, రమేష్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రోత్సహిస్తాం

గ్రామీణ క్రీడాకారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తామని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. గొళ్లపల్లిలో నిర్వహిస్తున్న కాక వెంకటస్వామి మెమోరియల్ కబడ్డీ టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కబడ్డీ ఆడి యువకులను ఉత్సాహపరిచారు. క్రీడల్లో గెలుపోటములను క్రీడాస్ఫూర్తితో స్వీకరించాలన్నారు. ఎంపీటీసీ హరీష్ గౌడ్, మాజీ సర్పంచ్ శశికళ, నిర్వహకులు తమ్మినవేణి రాజేష్ పాల్గొన్నారు.

అవకాశాలను ఉపయోగించుకుని ఉన్నతంగా ఎదగాలి

బెల్లంపల్లి: విద్యార్థులు అంది వచ్చిన అవకాశాలను వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ విద్యార్థులకు ఐఐటీ, నీట్ కోర్సు మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, క్రమశిక్షణ పట్టుదలతో చదివితే ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. అనంతరం కళాశాలలో అదనపు తరగతి గదులు, ఇతర సౌకర్యాల గురించి ప్రిన్సిపాల్, పేరెంట్స్ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేకు విన్నవించగా కావాల్సిన సౌకర్యాల కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రాంచందర్, పేరెంట్స్ కమిటీ గౌరవాధ్యక్షుడు దాగ తిరుపతి, అధ్యక్ష, కార్యదర్శులు పుదారి నగేష్‌గౌడ్, గోగర్ల రమేష్, రవి, వెంకటస్వామి, ప్రిన్సిపాల్ ఐనాల సైదులు, వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 5 : సీసీసీలోని కుమార్ గన్నర్స్ స్పోర్ట్స్ డిఫెన్స్ అకాడమీ మైదానంలో సబ్ జూనియర్ విభాగంలో బాలబాలికలకు బుధవారం కబడ్డీ ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు కబడ్డీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రాంచందర్ ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలలో పాల్గొనే 16 ఏళ్లలోపు బాలబాలికలు వయస్సు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, స్కూల్ బోనఫైడ్ సర్టిఫికెట్ సమర్పించి, రూ.50లు ఎంట్రీ ఫీజుగా చెల్లించాలని సూచించారు. ఎంపికైన జట్లు ఈ నెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు సూర్యాపేట జిల్లా మల్లారెడ్డిగూడెం ప్రాంగణంలో నిర్వహించే రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8099150447, 7702115889 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు



దండేపల్లి, ఫిబ్రవరి 5: మండల కేంద్రం బస్టాండ్ ప్రాంతంలో మిషన్ భగీరథ నీరు రోడ్డు పాలవుతోంది. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి తాళ్లపేట వరకు మిషన్ భగీరథ పథకం ద్వారా పైపులైన్ వేశారు. అయితే అధికారుల పర్యవేక్షణ లోపంతో భగీరథ నీరు లీకేజీలతో ఇంటింటికి తాగునీరు అందం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీరు వృథాగా పోకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలి

నెన్నెల, ఫిబ్రవరి 5: కేన్సర్ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా పాలియేటివ్ కేర్ (ఆలన) వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్ అన్నారు. కేన్సర్ వారోత్సవాల్లో భాగంగా డయాలసిస్ ఆఫ్ ఆదిలాబాద్ హ్యూమన్ ప్రమోషన్ సొసైటీ, కారితాస్ ఇండియాల ఆధ్వర్యంలో కుశ్నపల్లి ఉన్నత పాఠశాలలో సోమవారం ఉజ్వల కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు కేన్సర్‌పై అవగాహన కల్పించారు. డాక్టర్ శ్రీనివాస్ మాట్లాడుతూ చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, మంచి ఆహారం తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు స్క్రీనింగ్ టెస్టులు, గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. డానియల్, దేవదాసు, వీణ, ఇందర్ సింగ్, సత్యనారాయణ, సుజాత, రమాదేవి పాల్గొన్నారు.

ఇండ్లకు అడ్డంగా ఉందని భారీ వృక్షం నరికివేత

హాజీపూర్, ఫిబ్రవరి 5 : జాతీయ రహదారి పక్కన నిర్మించుకున్న ఇండ్లకు చెట్టు అడ్డంగా ఉందని భారీ వృక్షాన్ని నరికి వేసిన ఘటన సోమవారం గుడిపేటలో చోటు చేసుకుంది. గుడిపేటకు చెందిన కాంగ్రెస్ నాయకుడు ఒడ్డె శ్రీనివాస్‌తోపాటు అన్నదమ్ములకు సంబంధించి నాలుగు ఇండ్లను నిర్మించుకున్నారు. ఇండ్ల ముందు భారీ వృక్షం ఉండడంతో ఇండ్లకు అడ్డంగా ఉందని వృక్షాన్ని నరికివేయించాడు. భారీ వృక్షాన్ని నరికివేయడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై ఆర్అండ్‌బీ ఈఈ నర్సింహాచారిని సంప్రదించగా చెట్లు నరికిన విషయం తమ దృష్టికి రాలేదని, దీనిపై విచారణ జరిపి చెట్లు నరికిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.


జాతీయ రహదారి పక్కన ఉన్న వృక్షం నరికివేత

రైళ్ల రద్దుతో ప్రయాణికుల అవస్థలు

- బస్సులు, ప్రైవేటు వాహనాల్లో ప్రయాణాలు
- రద్దీతో ఇబ్బందులు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 5: కాగజ్‌నగర్-హైదరాబాద్ మార్గంలో వెళ్లే ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్ రైళ్లను రద్దుచేయటంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పటం లేదు. కాగజ్‌నగర్ నుంచి ప్రజలు వివిధ అవసరాల కోసం మంచిర్యాల, కరీంనగర్, హైదరాబాద్‌కు నిత్యం వెళ్లుతుంటారు. మూడోట్రాక్ పనులు కొనసాగుతుండటంతో రైళ్లరాకపోకలను రద్దుచేశారు. ప్రస్తుతం అంతా కూడా ఆర్టీసీ బస్సులు, ప్రయివేటు వాహనాల ద్వారా ప్రయాణాలు సాగిస్తున్నారు. రైళ్ల రద్దుతో ఆర్టీసీబస్సుల్లో నిల్చుందామంటే నిలబడలేని పరిస్థితి ఉందని ప్రయాణికులు పేర్కొంటున్నారు.అత్యవసరమున్నవారు కార్లను బుక్ చేసుకొని పట్టణాలకు వెళుతున్నారు. రైలు ద్వారా మంచిర్యాలకు 45నిమిషాల్లో చేరుకునే వారు బస్సులో వెళ్తుంటే రెండు గంటలు పడుతోందని వాపోతున్నారు. సమయం వృథా అవుతోందని, శ్రమ పడాల్సి వస్తోందని పేర్కొంటున్నారు. రైల్వే అధికారులు మరమ్మతు పనులను త్వరగా పూర్తిచేసి రైళ్లను పునరుద్దరించాలని అంతా కోరుతున్నారు.


రద్దీగా ఉన్న బస్సు నుంచి కిందకి దిగుతున్న ప్రయాణికులు

సిర్పూర్(టి) ఎంపీపీపై అవిశ్వాస నోటీసు


ఆర్డీవోకు అవిశ్వాస నోటీసు అందజేస్తున్న ఎంపీటీసీలు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 5: సిర్పూర్(టి) ఎంపీపీ సువర్ణపై అవిశ్వాస నోటీసును సోమవారం ఆర్డీవో సురేష్‌కు ఆరుగురు ఎంపీటీసీ సభ్యులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాసమస్యలు పరిష్కరించటం లేదని, మండలకేంద్రంలో జరిగే అభివృద్ధి గ్రామసభలకు ఎంపీపీ సక్రమంగా హాజరు కాకపోవటంతో మండల అభివృద్ధి కుంటు పడుతోందన్నారు. దీంతో మెజార్టీ ఎంపీటీసీలు కలిసి ఆర్డీవోకు అవిశ్వాస నోటీసు అందజేసినట్టు తెలిపారు. సిర్పూర్(టి) మండలపరిషత్ పరిధిలో 8 మంది ఎంపీటీసీలుండగా, ఇందులో ఆరుగురు ఎంపీటీసీలు అవిశ్వాసం పెట్టారు. వీరిలో ఐదుగురు ఎంపీటీసీలు బీఆర్ఎస్ మాజీఎమ్మెల్యే కోనప్ప వర్గానికి చెందిన వారు కాగా, ఒకరు బీఎస్పీకి చెందిన వారు.

క్రీడలతో మానసికోల్లాసం: ఎస్సై

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 5: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఈసుగాం ఎస్సై రామన్‌కుమార్ అన్నారు. ఆదివారం సాయంత్రం రాస్పెల్లిలో పాల్వాయి పురుషోత్తంరావు స్మారక క్రికెట్‌పోటీల ముగింపు పోటీల సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడాకారులు క్రీడల్లో రాణించి జిల్లాకు మంచిపేరు తేవాలన్నారు. సీనియర్ ఫార్మాసిస్టు తూడురు జగదీశ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొంగ సత్యనారాయణ, లక్ష్మణ్, గోలేంవెంకటేష్ పాల్గొన్నారు. రాధ-11 భట్టుపల్లి జట్టు రాస్పెల్లి జట్టుపై గెలుపొందింది. గెలుపొందిన జట్టుకు బహుమతులను అందజేశారు.

అవకాశం ఇస్తే ఎంపీగా పోటీ చేస్తా

బెజ్జూరు, ఫిబ్రవరి 5: ఆదివాసీ మహిళగా తనకు కాంగ్రెస్‌పార్టీ ఆదిలాబాద్ ఎంపీ టికెట్‌ఇస్తే పోటీలో ఉంటానని ఆదివాసీ మహిళాసంఘం రాష్ట్రప్రధాన కార్యదర్శి ఆత్రం సుగుణ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఆదివాసీభవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కొద్దేళ్లుగా జిల్లాలోని ఆదివాసీ ప్రజలపక్షానపోరాటం కొనాగిస్తున్నానని ప్రజాసేవలో ఉన్నందున కాంగ్రెస్ అధిష్టానం అవకాశంఇస్తే పోటీకి సిద్ధమేనని అన్నారు. కార్యక్రమంలో చిన్నయ్య, సుగుణ, శంకర్, సాయిమధు, పుల్లయ్య, మాదవరావు, సాగర్, శ్యాంరావు, భిక్షమయ్య, వెంకటేష్ పాల్గొన్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎమ్మెల్యే హరీష్‌బాబు


మంత్రికి వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, ఫిబ్రవరి 5: కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షేకావత్‌కు ఢిల్లీలో సోమవారం ఎమ్మెల్యే డాక్టర్ హరీష్ బాబు కలిశారు. వార్ధా ప్రాజెక్టుకు సహాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వార్ధాప్రాజెక్టు ఆవశ్యతకను ఆయనకు వివరించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండున్నర లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందంచే ప్రాజెక్టుకు సాయం చేయాలని వినతిప్రతం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పొలాడి హన్మంతరావు, పారిశ్రామికవేత్త చిలువేరు ప్రవీణ్ పాల్గొన్నారు.

గర్భిణులు ప్రతినెల పరీక్షలు చేయించుకోవాలి

వాంకిడి, ఫిబ్రవరి 5: గర్భిణులు ప్రతి నెల ప్రభుత్వ వైద్యశాలలో వైద్యపరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ వినయ్ కోరారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యసిబ్బందికి సమీక్షాసమావేశం నిర్వహించారు. నెలవారి నివేదికలను పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ప్రతినెల గర్భిణులు ఆసుపత్రికివచ్చి పరీక్షలు చేయించుకోవాలన్నారు. కాన్పుతప్పకుండా ఆసుపత్రిలోనే అయ్యేవిధంగా చూడాలన్నారు. సమా వేశంలో హెచ్ఈవో రవిదాస్, క్రిస్టియాన, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజల్లో గుర్తింపు ఉన్న వారికే ఎంపీ టికెట్టు ఇవ్వాలి

జైనూర్, ఫిబ్రవరి 5: నిత్యం ప్రజల్లో ఉంటూ, సేవాభావం కలిగిన నాయకులకే ఎంపీ టికెట్టు ఇవ్వాలని జైనూర్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అయ్యుబ్‌ఖాన్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఆయన మాట్లాడుతూ రాజకీయ అనుభవం, ప్రజల్లో గుర్తింపు ఉన్న వారికే టికెట్టు ఇవ్వాలని ఆయన అన్నారు.

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5: జిల్లాలో అర్హులైన వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జిల్లా జర్నలిస్టుల జేఏసీ బాధ్యులు రహెమాన్, రవినాయక్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇతర జిల్లాల జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు ఇచ్చారని ఆసిఫాబాద్ జిల్లాలో కూడా ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో జర్నలిస్టు జేఏసీ నాయకులు ప్రకాష్‌గౌడ్, వేణుగోపాల్, తుకారాం, నరేందర్, సంతోష్, కృష్ణంరాజు, స్వామి తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న జర్నలిస్టు జేఏసీ నాయకులు

రాష్ట్ర స్థాయిలో జిల్లా పేరును నిలబెట్టాలి

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 5: జిల్లాకేంద్రంలోని మోడల్‌స్కూల్‌లో జన విజ్ఞానవేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన చెకుముకి సైన్స్‌టాలెంట్‌టెస్ట్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు రాకేష్, వర్షిత్, జశ్వంత్‌కు డీఈవో అశోక్ బహుమతులు ప్రదానంచేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా ర్థులు రాష్ట్రస్థాయిలో జిల్లాపేరును నిలబెట్టాలన్నారు. కార్యక్రమంలో సైన్స్‌అధికారి మధుకర్, ప్రిన్సిపాల్‌ఖలీల్, సెక్టోరియల్ ఆఫీసర్‌భరత్,అబిద్‌అలీ, ఉపాధ్యాయులు రవీందర్, తిరుపతయ్య, కృష్ణచారి,ప్రవీణ్,రాజేష్,లక్ష్మణ్,ఊశన్న పాల్గొన్నారు.

రేపు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలి

ఆసిఫాబాద్ రూరల్, ఫిబ్రవరి 5: జిల్లాలో పీఎంజన్‌మన్ కార్యక్రమంలో భాగంగా మొబైల్ మెడికల్‌యూనిట్‌లో పోస్టుల నియామకానికి ఒప్పంద ప్రాతిపదికన అర్హతగల అభ్యర్థుల జాబితా వైద్యఆరోగ్యశాధికారి నోటీసుబోర్డుపై పొందుపర్చామని జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారి తుకారాం ఒక ప్రకటనలో తెలిపారు. మెరిట్ జాబితాలో పేరుగల అభ్యర్థులు ఈనెల7న అన్ని సర్టిఫికేట్లతో కలెక్టరేట్‌లోని ఐడీవోఎస్‌లో నిర్వహించే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని కోరారు.

16న దేశవ్యాప్త సమ్మె

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5: సివిల్‌సప్లయి కార్పొరేషన్‌లో పనిచేస్తున్న హమాలి కార్మికులు ఈనెల16న జరిగే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లాప్రధానకార్యదర్శి ఉపేందర్ కోరారు. ఈ సందర్భంగా హమాలిసంఘం నాయకులతో కలిసి సివిల్‌సప్లయి డీఎం నరసింహ స్వామికి సమ్మెనోటీసు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు దినకర్, సుధాకర్, శ్రీనివాస్, నారాయణ, రాజు,రాజన్న,దత్తు,జుగాదిరావు తదితరులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ పోస్టర్ల ఆవిష్కరణ

కెరమెరి, ఫిబ్రవరి 5: ఈనెల8,9న ఢిల్లీలో నిర్వహించే పార్లమెంట్ ముట్టడి కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను బీసీ విద్యార్థిసంఘం నాయకులు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబీసీల జాతీయ సదస్సును జంతర్‌మంతర్ వేదికగా ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో లహుకుమార్, కిరణ్, ఆనంద్‌రావు,సుభాష్,మహేష్,నవీన్ పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ మండల కమిటీ

బెజ్జూరు, ఫిబ్రవరి 5: మండల టీఎస్‌యూటీఎఫ్ కమి టీని జిల్లా కార్యదర్శులు రవికుమార్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నందుకుమార్, ప్రధానకార్య దర్శిగా టోనీ, ఉపాధ్యక్షులుగా జ్ఞానేశ్వర్, లావణ్య, మహేం దర్, కార్యదర్శులుగా రాజశేఖర్, సుమలత, అవినాష్, జీవన్, యాకూబ్, రాజమణి, సమ్మక్క, భీంరావు, జమీల్‌ను ఎన్నుకున్నారు.

క్రికెట్ టోర్నమెంట్

రెబ్బెన, ఫిబ్రవరి 5: రెబ్బెన మండల మాజీజడ్పీటీసీ కార్నథం చంద్రయ్య స్మారక గ్రామస్థాయి క్రికెట్ టోర్నీని ఈనెల8 నుంచి ఎడవెల్లిలో నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.30వేలు, రెండో బహుమతి రూ.15వేలు ఉంటుందని తెలిపారు. ఆసక్తిగలవారు తమపేర్లను నమోదు చేసుకోవాలన్నారు. ఇందుకు 9963291872, 8688361950ను సంప్రదించాలని కోరారు.



అంగన్‌వాడీ కేంద్రాలకు సన్నబియ్యం

సద్వినియోగం చేసుకుంటున్న గర్భిణులు, బాలింతలు, చిన్నారులు



భగత్‌సింగ్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో భోజనం చేస్తున్న చిన్నారులు

రెబ్బెన, ఫిబ్రవరి 5: ప్రభుత్వ పాఠశాలల్లో సన్న బియ్యంతో అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ అమలు చేయాలన్న సంకల్పానికి ఎట్టకేలకు ఉన్నతాధికారులు శ్రీకారం చుట్టారు. మూడు నెలల నుంచి అంగన్‌వాడీ కేంద్రాల్లో సన్నబియ్యంతో భోజనం పెడుతున్నారు. దీంతో దొడ్డన్నం తినే బాధలు తప్పినట్లయిందని పలువురు పేర్కొంటున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సన్నబియ్యంతో వండి భోజనాన్ని తినటానికి చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఇష్టపడుతున్నారు. మూడేళ్ల నుంచి ఐదేళ్ల చిన్నారులకు రోజు ఒక ఉడికించిన గుడ్డు, 75గ్రాముల బియ్యం, 15 గ్రాముల కంది పప్పు, 5గ్రాముల నూనెలతో చేసిన ఆహారం, 20గ్రాముల మురుకులు, 50గ్రాముల బాలామృతం అందజేస్తున్నారు. ఏడు నెలల నుంచి మూడేళ్ల లోపు వారికి నెలకు 16గుడ్లు, పంపిణీ చేస్తున్నారు. కేంద్రాలకు వచ్చే గర్భిణులు, బాలింతలకు ఆరోగ్యలక్ష్మి పథకం పేరుతో రోజూ 150 గ్రాముల బియ్యం, 30గ్రాముల కందిపప్పు ఇతర పోషకాలతో భోజనం అందిస్తున్నారు.

జిల్లాలో 973 అంగన్‌వాడీ కేంద్రాలుండగా ఇందులో గర్భిణులు 4858, బాలింతలు 5227, చిన్నారులు 44,417 ఉన్నారు. వీరందరికీ సన్న బియ్యం పెడుతుండటంతో వారందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మధ్యాహ్న భోజనం తీరుపై కూడా ఐసీడీసీ పీడీ సావిత్రి ఆధ్వర్యంలో సిబ్బంది జిల్లాలోని అన్ని కేంద్రాలను పరిశీలిస్తున్నారు. పలు సమస్యల పట్ల అడిగి తెలుసుకుంటున్నారు. సన్న బియ్యం పంపిణీపై గతంలో సర్వేలు చేసినప్పటికీ ఆచరణలోకి రాలేదు. తాజాగా మూడు నెలల నుంచి ఈ ప్రక్రియ చేపడుతుండటంతో సుదీర్ఘ కల నెరవేరినట్లయింది.

భోజనం బాగుంది..

సునీత, గర్భిణీ, భగత్‌సింగ్‌నగర్



అంగన్‌వాడీ కేంద్రాల్లో సన్నబియ్యంతో భోజనం పెడుతున్నారు. తినేందుకురుచికరంగా ఉంటోంది. భోజనం బాగుంది. అరగంటలోనే తినగలుగుతున్నాం. చాలా సంతోషంగా ఉంది. అలాగే పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తున్నారు. ఆరోగ్యంగా ఉన్నాను.

అందరూ సద్వినియోగం చేసుకుంటున్నారు..

చంద్రకళ, అంగన్‌వాడీ, టీచర్



అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులకు, బాలింతలకు సన్నబియ్యంతో భోజనం పెడుతున్నాం. అందరు సద్వినియోగం చేసుకుంటున్నారు. పోషకాహారంతో పాటు రుచికరమైన భోజనం పెడుతుండటంతో అంతా క్రమ తప్పకుండా వస్తున్నారు. అలాగే చిన్నారులు కూడా తింటున్నారు.

పిల్లలు చక్కగా భోజనం చేస్తున్నారు

సంధ్యారాణి, బాలింత



పిల్లలు చక్కగా భోజనం చేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సన్నబియ్యంతో భోజనం చేసి పెడుతున్నారు. దీంతో పిల్లలు అంగన్‌వాడీ కేంద్రాల్లో సక్రమంగా భోజనం చేస్తున్నారు. క్రమం తప్పకుండా పాఠశాలకు వస్తున్నారు. చాలా సంతోషంగా ఉంది.

ఎన్నికలకు ఈవీఎంలను సిద్ధం చేయాలి: కలెక్టర్



ఈవీఎం గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ హేమంత్ బొర్కడే

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5: రాబోయే పార్లమెంట్ ఎన్నికలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను సిద్ధం చేయాలని కలెక్టర్ హేమంత్ బొర్కడే అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని ఈవీఎం గోదాంలను అదనపుకలెక్టర్ దాసరి వేణుతో కలిసి గుర్తింపుపొందిన రాజకీయ పార్టీలప్రతినిధుల సమక్షంలో పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చేలోక్‌సభ ఎన్నికలకు ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రతి ఈవీఎం పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఈసీఎల్ ఇంజనీర్ల సాయంతో ప్రతి పరికరాన్ని పనిచేసే విధంగా పర్యవేక్షించాలని తెలిపారు. అనంతరం మార్కెట్‌యార్డులోని స్ట్రాంగ్‌రూంలో భద్రపరిచిన ఈవీఎంలను రాజకీయపార్టీల ప్రతినిధుల సమక్షంలో పరిశీ లించారు.

గ్రామాల అభివృద్ధికి సమన్వయంతో పనిచేయాలి..

గ్రామపంచాయతీల అభివృద్ధికి అధికారులు, కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ హేమంత్‌బొర్కడే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ డివిజన్ల ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి ఆయన అదనపు కలెక్టర్ దీపక్ తివారితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలోని 335 గ్రామపంచాయతీలకు 175మంది మండలస్థాయి అధికారులను ప్రత్యేకాధికా రులుగా నియమించామన్నారు. ఈ నెల 7నుంచి 15వరకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. నూతన పంచాయతీరాజ్ చట్టాలపై ప్రత్యేకాధికారులు అవగాహన కలిగి ఉండాలన్నారు. సమావేశంలో జిల్లాపంచాయతీ అధికారి ఉమర్‌హుస్సేన్, జిల్లాగ్రామీణాభివృద్ధి అధికారి సురేందర్, డీపీవో సురేష్, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5: కాగజ్‌నగర్ మున్సిపల్ కార్యాల యంలో పనిచేస్తున్న కాంట్రాక్టుకార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ హేమంత్ బొర్కడేకు వినతిపత్రం అందజేశారు. రూ.24,500వేతనం అమలు చేసి సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు శ్రీనివాస్, త్రివేణి, శంకర్, సంజీవ్, మల్లేష్, రమేష్, బాపు, శంకరమ్మ, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

● అధికారులతో కలెక్టర్ హేమంత్ బొర్కడే



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ హేమంత్ బొర్కడే

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5: ప్రజావాణిలో ప్రజలు చేసుకున్న దరఖాస్తులను అధికారులు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ హేమంత్ బొర్కడే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అర్జీదారుల నుంచి ఆయన దరఖాస్తులు స్వీకరించారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన సతీష్‌కుమార్ తాను దివ్యాంగుల పెన్షన్ పొందానని, సదరం సర్టిఫికేట్ రెన్యూవల్ కొరకు దరఖాస్తు చేసుకోగా జీరోశాతంగా ధృవీకరించారని, దీనిని సవరించి తనకు సదరం సర్టిఫికేట్ మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకున్నాడు. రెబ్బెన, కాగజ్‌నగర్ మండలాలకు చెందిన సత్తక్క, శకుంతల, తమ తాతల నుంచి వచ్చినఆస్తిని తమకుతెలియకుండా వేరే వ్యక్తులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నారని, ఈ ప్రక్రియను నిలిపేయాలని దరఖాస్తు అందజేశారు. వాంకిడి మండలం సడక్‌గూడ గ్రామానికి చెందిన షేక్ షకీల్ బీ నిరుపేద అయిన తనకునిలిపేసిన రేషన్‌కార్డును పునరుద్ధరించి ఇందిరమ్మఇల్లు మంజూరుచేయాలని అర్జీ సమర్పించారు. కౌటాలమండలం సదాశివపేటకుచెందిన రామారావు తన పేరిట రిజిస్ట్రేషన్ కావాల్సిన భూమిని తన కుమారులు అక్రమంగా తమ పేరిట చేసుకున్నారని తనకు తనకుమారుల నుంచి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించి న్యాయం చేయాలని దరఖాస్తు అందజేశాడు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన వనితరాణి తాను డిగ్రీ పూర్తి చేశానని, తన భర్త అనారోగ్యం కారణాలతో పిల్లల పోషణ భారంగా ఉందని, తనకుఉపాధి కల్పించాలని దరఖాస్తు అందజేసింది. చింతలమానేపల్లి మండలం రన్‌వెల్లి గ్రామానికి చెందిన అస్మీనా తనకు90శాతం మూగ,చెవిటి వికలాంగత్వం ఉందని, పెంచికలపేట, బొంబాయిగూడ గ్రామానికి చెందిన వెంకటేష్ తనకు కుడికన్ను వందశాతం కనబడదని, గతంలో నిర్వహించిన సదరమ్ శిబిరంలో జీరో శాతంగా నమోదు చేయడంతో తాము పెన్షన్ నష్టపొందలేక పోతున్నామని, తమకు పెన్షన్‌వచ్చేలా చూడాలని వేర్వేరుగా దరఖాస్తు అందజేశారు. జిల్లాకేంద్రంలోని రాజంపేట గ్రామస్థులు వీధి దీపాలు, మురుగుకాలువలు, రోడ్లు లేక అవస్థలు పడుతున్నామని దరఖాస్తుచేశారు. రెబ్బెన మండలం చిలుకమారిగూడ గ్రామానికి చెందిన శంకరయ్య తమ తండ్రి పేరిట గ్రామ శివారులో భూమి ఉందని వివరాలు ఆన్‌లైన్‌చేసే సమయంలో ఇతరుల పేరిట నమోదయిందని, సవరించి న్యాయం చేయాలని దరఖాస్తు చేశారు.

పల్లెబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్



మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

కాగజ్‌నగర్/వాంకిడి, ఫిబ్రవరి 5: జిల్లాలో మంగళవారం నుంచి జరిగే పల్లెబాట కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాలని ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం కాగజ్‌నగర్, వాంకిడి మండలాల్లో ఆయన మాట్లాడారు. పల్లెబాటలో అంతా పాల్గొని బీజేపీ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలన్నారు. త్వరలో జరిగే పార్లమెంటు ఎన్నికలకు అంతా సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధానకార్యదర్శి దోని శ్రీశైలం, గణపతి, ఈర్ల విశ్వేశ్వర్ రావు, సమీర్ గుప్తా, వాంకిడిలో అరుణ్‌లోయా, సుచిత్, నరేష్, అరుణ తదితరులు పాల్గొన్నారు.

రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5: భువనగిరిలో పదవతరగతి చదువుతూ ఆత్మహత్య చేసుకున్న భవ్య, వైష్ణవి విద్యార్థినుల కుటుంబాలకు చెరో రూ.20లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించి, విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని కేవీపీఎస్ నాయకులు దినకర్ డిమాండ్ చేశారు.

హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

ఆసిఫాబాద్‌రూరల్, ఫిబ్రవరి 5: వ్యక్తిని హత్య చేసిన కేసులో నిందితుడికి జీవితఖైదు విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లాసెషన్స్‌కోర్టు ప్రధానన్యాయమూర్తి ఎంవీ రమేష్ తీర్పు ఇచ్చారు. కాగజ్‌నగర్ సీఐ శంకరయ్య తెలిపినవివరాల ప్రకారం.. 2020 సంవత్సరంలో కాగజ్‌నగర్ సర్దార్‌బస్తీకి చెందిన జాడి జశ్వంత్‌ను అదేబస్తీకి చెందిన బావండ్లపల్లి ప్రవీణ్‌కుమార్ హత్యచేసిన నేరంపై కేసునమోదు కాగా పీపీ జగన్మోహన్‌రావు కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. అప్పటిఐవోడీ సీఐమోహన్ విచారణ జరపగా హత్యానేరం రుజువు కావడంతో నేరస్థు ప్రవీణ్‌కుమార్‌కి సెక్షన్302ఐపీసీ ప్రకారం జీవిత కాలం జైలుశిక్ష, రూ.20వేల జరిమానా విధించారు. కేసులో నిందితుడికి శిక్ష పడేలా కృషిచేసిన పోలీసు అధికారులు, కోర్టు సిబ్బంది, కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్సైసాగర్, కాగజ్‌నగర్ డివిజనల్ లైజనింగ్ ఆఫీస్ బాబాను ఎస్పీ సురేష్‌కుమార్ అభినందించారు.

యోగాలో విద్యార్థినుల ప్రతిభ

కౌటాల, ఫిబ్రవరి 5: కాకా మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం మంచిర్యాలజిల్లా బెల్లంపల్లి పట్ట ణంలో నిర్వహించిన యోగాపోటీల్లో కౌటాలకు మండల కేంద్రానికి చెందిన దాసరి ధార్మిక బంగారు పతకం, క్రామె జాకిలిని కాంస్య పతకం గెలుపొందారు. జిల్లా యోగా ప్రచారక్ వినోద్‌గౌడ్ వారి అభినందించారు.

పోతరాజు ఆలయానికి పోటెత్తిన భక్తులు



పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు

కెరమెరి, ఫిబ్రవరి 5: మండలంలోని ఇందాపూర్ పెద్ద వాగు నదితీరన కొలువైన పోతరాజ్‌ఆలయం సోమవారం భక్తజనంతో సందడినెలకొంది. ప్రతియేటా నిర్వహించే జాతర మహోత్సవానికి ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా గిరిజనులు భారీగా తరలివచ్చి తమ ఆరాధ్య దైవానికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం రాత్రి మహాపూజతో ప్రారంభమైన ఉత్సవాలు మూడు రోజుల పాటు కొనసాగుతాయి. సోమవారం వేకువజామున సిడాం వంశీయులు పోతరాజు దేవుడికి నవధాన్యాలతో నైవేద్యం సమర్పించారు. జాతర ఉత్సవాలకు ఉమ్మడిజిల్లాతోపాటు మహారాష్ట్రభక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. జాతరకు వచ్చిన భక్తులు గిరిజన సంప్రదాయ పద్ధతిలో నృత్యాలు చేస్తూ అలరించారు. జాతరలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో 50కి పైగా జట్లు పాల్గొన్నాయి. జాతరలో ఎంపీపీ మోతీరాం, జడ్పీటీసీ ద్రుపతాబాయి, ఏటీడీవో భాస్కర్, ఆలయ కమిటీ చైర్మన్ సిడాం రాజు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5: మహిళాశిశుసంక్షేమశాఖ పరిధిలో నడుస్తున్న జిల్లా మహిళాసాధికారత కేంద్రం ఆధ్వర్యంలో బేటీబచావో బేటీపడావో స్కీంలో భాగంగా ఆసిఫాబాద్, కాగజ్‌నగర్ ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థులకు 45రోజుల బ్యూటీషియన్ శిక్షణ ఇచ్చేందుకు బ్యూటీషియన్‌కోర్సులో శిక్షణ పొందిన అనుభవ జ్ఞులైన మహిళా అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమాధికారిణి సావిత్రి ఒక ప్రకటనలో కోరారు. ఈ నెల8లోగా తమ విద్యార్హత, శిక్షణపొందిన సర్టిఫికేట్‌తో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బయోమెట్రిక్ కోసం పడిగాపులు

ఆసిఫాబాద్, ఫిబ్రవరి 5: జిల్లాకేంద్రంలోని మెడికల్ కళాశాలలో ఇటీవల ఎంపికైన నర్సింగ్ ఆఫీసర్స్, స్టాఫ్‌నర్స్ అభ్యర్థులు బయోమెట్రిక్ కోసం పడిగాపులు కాశారు. స్టాఫ్‌నర్సులుగా ఎంపికైన అభ్యర్థులు సోమవారం కళాశాలలో జాయినింగ్ రిపోర్టు చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా అటెండెంట్ బయోమెట్రిక్ కోసం ఉదయం నుంచి రాత్రి 9 గంటల వరకు నిరీక్షించాల్సి వచ్చింది. అభ్యర్థుల్లో చాలా మంది చంటి పిల్లల తల్లులు, గర్భిణులు ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా తీవ్ర ఇబ్బందులు పడ్డామని వారు ఆరోపించారు.

సంస్థ ప్రగతితోనే ఉద్యోగుల అభివృద్ధి



శ్రీరాంపూర్, ఫిబ్రవరి 5: సింగరేణి ప్రగతిపథంలో నడిస్తేనే ఉద్యోగులు అభివృద్ధి చెందుతారని ఎస్‌వోటు జీఎం కె రఘుకుమార్ అన్నారు. ఎస్ఆర్పీ3, 3ఎ గనిపై సోమవారం మల్టీడిపార్ట్‌మెంటల్ సమావేశం ఏర్పాటు చేయగా, ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గనులలో ఉత్పత్తి, ఉత్పాదకత, నాణ్యత, ప్రమాణాలు పెంచాలని, నిర్దేశిత లక్ష్యాలను చేరుకునేందుకు ప్రయత్నించాలని సూచించారు. ఏఐటీయూసీ బ్రాంచ్‌కార్యదర్శి బాజీసైదా మాట్లాడుతూ, కార్మికుల సమస్యలు, గనులపై అవసరాలు తెలుసుకునేందుకు మల్టిడిపార్ట్‌మెంటల్ సమావేశాలు ఒక వేదిక అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏజెంట్ గోపాల్‌సింగ్, ఎస్ఈ(ఐఈడీ) కె కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

రియాజ్ అహ్మద్‌కు కార్మికరత్న అవార్డు



రియాజ్ అహ్మద్

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 5: హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రియాజ్ అహ్మద్ బహుజన సాహిత్య అకాడమీ(బీఎస్ఏ) ఆధ్వర్యంలో అందించే కార్మికరత్న ఇంటర్నేషనల్ అవార్డు-2024కు ఎంపికయ్యారు. ఈ నెల11న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తిరుపతిలో జరిగే బహుజన రచయితల 7వ దక్షిణ భారత సదస్సులో ఈ అవార్డును రియాజ్‌అహ్మద్‌కు అందించనున్నారు. ఈ మేరకు బీఎస్ఏ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాక్రిష్ణ, దక్షిణభారత ప్రధానకార్యదర్శి, సదస్సు నిర్వాహకుడు జి విష్ణువర్ధన్ లేఖ ద్వారా ఆయనకు సమాచారం అందించారు.

ఉద్యోగులకు అన్ని విషయాలపై అవగాహన ఉండాలి



రక్షణ ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు, ఉద్యోగులు

మందమర్రి టౌన్, ఫిబ్రవరి 5: సింగరేణిలో పనిచేస్తున్న ప్రతిఒక్కరు ఉత్పత్తి, ఉత్పాదకతతోపాటు గనిలోని అన్ని విషయాలపై అవగాహన కలిగి ఉండాలని ఏరియా జీఎం మనోహర్ అన్నారు. సోమవారం ఏరియాలోని కేకే5 గనిపై నిర్వహించిన మల్టీడిపార్టుమెంట్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగులు, అధికారులు సంస్థ మనదనే భావనతో పని చేయాలన్నారు. ఉత్పత్తి లక్ష్యాలను పెంచుకుంటూ వ్యయాలను తగ్గించుకోవడం కోసం తగుసూచనలు, సలహాలు తీసుకోవడానికి ఇలాంటి సమావేశాలు ఉపయోగపడతాయన్నారు. ఏరియాలోనష్టాలను తగ్గిస్తూ లాభాలు ఎలాసాధించాలనే అంశంపై సూచనలు ఇవ్వాలని ఆయన తెలిపారు. విలువైన సలహాలిస్తే వాటిని తప్పకుండా పాటిస్తామని తెలిపారు. కంపెనీ స్థితిగతులకు సంబంధించి ప్రొజెక్టర్ ద్వారా డీజీఎం ఈఅండ్ఎం నాగరాజు, ఎస్‌వోటూ జీఎం రాజేశ్వర్‌రెడ్డి, పీఎం శ్యాంసుందర్, ఐఈడీ డీజీఎం రాజన్న వివరించారు. కార్యక్రమంలో గని మేనేజర్ భూశంకరయ్య, రక్షణాధికారి రమేష్, సంక్షేమాధికారి కార్తీక్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంస్థ ప్రగతికి సూచనలు అందజేసిన పలువురు ఉద్యోగులకు బహుమతులు అందజేశారు.







